APTEL/25/A2844


# క్రైమ్ కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం    తెలుగు దిన పత్రిక

సంపుటి : 01  సంచిక : 45  క్రిష్ణా, ఆదివారం 09- 11 - 2025  పేజీలు : 4  వెల. 2 /-




## వడ్డీ నారాయణరావు సేవలు మరువలేనివి....



**మచిలీపట్నం,( క్రైమ్ కౌంటర్)నవంబర్ 8,** కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ట్రేడ్ యూనియన్ పూర్వ ప్రధాన కార్యదర్శి, సీనియర్ టిడిపి నాయకులు వడ్డీ నారాయణరావు 90వ జన్మదిన వేడుకలు శనివారం మచిలీపట్నం చిలకలపూడిలో ఘనంగా వారి నివాసంలో నిర్వహించారు. కృష్ణా జిల్లాలో పలు ప్రాంతాలనుండి పెద్ద సంఖ్యలో కార్మిక సంఘాల నాయకులు పార్టీ కార్మిక సంఘాల నాయకులునాయకులు కూటమి నాయకులు, హాజరై ఆయనను ఘనంగా సన్మానించారు. గతంలో మచిలీపట్నం మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు అంబటి బ్రాహ్మణయ్య, కైకాల సత్యనారాయణ, వల్లభనేని బాల సౌరి శాసనసభ్యులు వడ్డీ రంగారావు నడకుదిటి నరసింహారావు, కొల్లు రవీంద్ర విజయానికి కృషి చేశారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా వడ్డీ నారాయణరావు కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వపరంగా ఎంతో సహాయ సహకారాలు అందించి కార్మికుల మన్ననులు పొందారు. పేద కాపు విద్యార్థుల ఉన్నత కోసం ఆర్థిక సహాయం చేస్తూ కాపుకుల సంక్షేపం కోసం కూడా వడ్డీ నారాయణరావు సేవలందించారు. సేవా మూర్తికి 90 సంవత్సరం పుట్టినరోజు జరగటం ఆనందదాయకమని వక్తలు అన్నారు. శనివారం జరిగిన కార్యక్రమంలో మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ 15వ వార్డు మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ పట్టు వస్త్రాలతో వడ్డీ నారాయణరావు దంపతులను అభినందించారు.వడ్డీ నారాయణరావు దంపతులను ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పంతం వెంకట గజేంద్రరావు గజేంద్రరావు బిజెపి నాయకులు తోట రంగనాథ్ చలమలశెట్టి రామకృష్ణ సువర్ణ కళ్యాణమందిరం అధ్యక్ష కార్యదర్శులు ఆలపాటి రమేష్, పంచపర్వాల వెంకట సుబ్బారావు, వడ్డీ శేషు సీనియర్ జర్నలిస్టు సలాది పూర్ణచంద్రరావు తదితరులు సత్కరించి అభినందనలు తెలియజేశారు.

## బీర పంట పొలంకు... పొలం చుట్టూ కంచెగా ఏర్పాటు చేసిన...కంచె"పట్టు చీర



**పెడన, క్రైమ్ కౌంటర్ న్యూస్ ,నవంబర్ 08 క్రిష్ణా :** పంట పండించడమే కాదు దాన్ని కాపాడుకోవడమూ ఇప్పుడు రైతులకు సవాలుగా మారింది. వానలు, వరదలు, తుఫానులు, ప్రకృతి రైతును పరీక్షిస్తూనే ఉన్నాయి. దానికి తోడు ఎలుకలు పందికొక్కులు, పక్షుల బెడద రైతు శ్రమను వృధా చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బీరపంటను కాపాడుకోవడానికి రైతు రక్షణ కోసం బీర పంట పొలం చుట్టు తన ఇంట్లో ఉన్న చీరాలను కంచెలా అల్లుకుని పంట చుట్టు వేశాడు. మనసుంటే మార్గం ఉంటుందన్న ఆలోచనను వరం ప్రత్యక్షంగా చేసి చూపిస్తే పిల్ల గాలుల సవ్వడికి ఊగుతున్న చీరలు చూపరులకు చివరికి చీరే సింగారమాయే అన్నట్టు కనిపిస్తోంది.

## ఇసుక టిప్పర్ వస్తోంది.... పక్కకు పక్కకు జరగండి

### బైపాస్ రోడ్డు వదిలి...టౌన్ లో ప్రవేశిస్తున్న ఇసుక టిప్పర్లు ట్రాఫిక్ నిబంధనలు గాలికి


**పెడన, క్రైమ్ కౌంటర్ న్యూస్ ,నవంబర్ 08 క్రిష్ణా :** మచిలీపట్నం – గుడివాడ జాతీయ రహదారి వెంబడి ప్రయాణాలు కొనసాగించాలంటే వాహనదారులు జంకుతున్నారు. మరోవైపు వాహనాల రద్దీ... దీనికి తోడు అధిక ఇసుక లోడుతో ఇష్టారాజ్యంగా రవాణా చేస్తున్నారు. బైపాస్ రోడ్డు వదిలి టౌన్ లో నుండి భారీ వాహనాలు వెళుతున్న పట్టించుకోని పోలీసులు ట్రాఫిక్ రూల్స్ ను తుంగలో తొక్కిన వాహందారులు అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణీత లోడు, వేగంతో.... మాత్రమే ఇసుక రవాణా చేయాలని అధికారులు జరిమానాల విధించి చెబుతున్న పెడచెవిని పెడుతున్నారు. కానీ కొందరు యజమానుల ఒత్తిడితో... అధిక ట్రిప్పులు చేయాలనే ఉద్దేశంతో వేగంగా వాహనాలు నడుపుతున్నారు. దీనికి తోడు స్పీడు బ్రేకర్లు, గుంతల వద్ద కూడా అదే వేగంతో వెళ్తుండటంతో లారీలోని ఇసుక రహదారులు, వాహనదారుల పైన పడుతున్నాయి.



వెనక వచ్చే ద్విచక్ర, ఇతర వాహనాల చోదకులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. దీనిని కట్టడి చేయాలని పలువురు వాహనదారులు అంటున్నారు.

## వేలాడుతున్న కొమ్మలను తొలగించండి

### తొలగిస్తే విద్యార్థులను కాపాడినట్లే




**పెడన, క్రైమ్ కౌంటర్ న్యూస్ ,నవంబర్ 08 క్రిష్ణా :** మొంథా తుఫాను ప్రభావం కారణంగా పట్టణంలో అనేక వార్డుల్లో బలమైన ఈదురు గాలులతో భారీ వృక్షాలు నెలకొరిగాయి. దీనికి సంబంధించి మున్సిపల్ అధికారులు యుద్ధ ప్రాతిపధికన చెట్లను తొలగించారు.అయితే పెడన పట్టణంలోని బట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందుకు భిన్నం గా కనిపిస్తుంది. పాఠశాలలో బారి వృక్షాలు నేలకోరిగాయి.అయితే వృక్షానికి సంబంధించి పెద్ద పెద్ద చెట్టు కొమ్మలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఆ చెట్టు కొమ్మల కిందనుండి పాఠశాలకు రావడానికి భయబ్రాంతులకు గురవుతున్నారు.అదే చెట్టు కింద పాఠశాల విద్యార్థులు సైకిల్స్ పార్కింగ్ చేస్తుండటంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోన్న భయందోళనలో విద్యార్థులు కాలం వెళ్ళాదీస్తున్నారు.


## తల్లిని కోల్పోయిన చిన్నారికి పుట్టిన రోజు వేడుకలు చేసి మానవత్వాన్నిచాటిన ఎస్సై...



### కొండంత మానవత్వాన్ని చాటిన పురుషోత్తముడు...

**ఎన్టీఆర్ జిల్లా,కొండపల్లీ మున్సిపాలిటీ,నవంబర్ 08(క్రైం కౌంటర్ డెస్క్):** ఇబ్రహీంపట్నం సీఐ చంద్రశేఖర్ చొరవతో తల్లి లేని చిన్నారికి అన్నీ తానై పుట్టినరోజు జరిపించిన కొండపల్లి ఎస్ఐ. నిన్నటిదాకా తల్లి వడిలో ఆనందంగా గడిపిన ఒక చిన్నారి పట్ల విధి చిన్నచూపు చూసింది.ఆనందం గా పుట్టినరోజు జరుపుపుకోవాల్సిన చిన్నారి పసి హృదయం తల్లి లేదన్న చేదు నిజాన్ని గుర్తుతెచ్చు కుంటూ కుమిలిపోతుంది.కేసు విచారణ నిమిత్తం కుటుంబసభ్యులతో మాట్లాడేందుకు వెళ్లిన ఎస్ ఐ కు పసి హృదం పడుతున్న బాధ,ఆవేదన చూసి మనసు చెలించింది. తల్లిలా లాలించి..ముద్దాడి..సందడి చేయించేందుకు తల్లి లేదు ... మరణించిన తల్లిని గుర్తు తెచ్చుకుని విలపిస్తున్న చిన్నారి గురించి తెలుసుకున్న కొండపల్లి సబ్ ఇన్స్పెక్టర్ పురుషోత్తం.వెంటనే స్పందించి అన్నీ తానై పుట్టినరోజు వేడుక చేసి అందరి మన్ననలు పొందారు..కొండపల్లిలో నివాసం ఉంటున్న చిన్నారి పూర్విక ఇటీవలే తన తల్లిని పోగొట్టుకుంది శనివారం నాడు పూర్విక పుట్టినరోజు ఈ సందర్భంగా ఆ చిన్నారి పుట్టినరోజు వేడుకను స్కూల్ పిల్లల మధ్య నిర్వహించి పూర్విక కళ్ళల్లో ఆనందాన్ని నింపారు.విషయం తెలుసుకున్న తోటి విద్యార్థుల తల్లితండ్రులు, స్థానికులు పోలీసులను అభినందించి, వారు చేసిన మంచి పనిని శభాష్ పోలీస్ అంటూ అభినందించారు.

## గుంత తీశారు....పూడ్చడం మరిచారు



**పెడన, క్రైమ్ కౌంటర్ న్యూస్ ,నవంబర్ 08 క్రిష్ణా :** పెడన పట్టణ పురపాలక సంఘ కార్యాలయం ఎదురుగా మంచి నీటి పైప్ లైన్ కి సంబంధించిన వాల్వ్ మరమ్మత్తులలో భాగంగా గుంత తీసి పనులు పూర్తి చేసినప్పటికి గుంతను పూడ్చడం మాత్రం మరిచారు. ఈ గుంత ప్రధాన రహదారి పక్కన,మూల మలుపు వద్ద ఉండడటంతో ఎటువంటి ప్రమాద హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందో అని పాదాచారులు, వాహనాధారులు భయపడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చి ప్రమాదాలను అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ట్రాక్టర్‌తో వరిపంటను దున్నేసిన అన్నదాత



యాదమరి, నవంబరు 8 ఆరుగాలం కష్టించి సాగుచేసిన పంట భారీవర్షాలకు పూర్తిగా దెబ్బతినడంతో ఓ రైతు పంటను ట్రాక్టర్‌తో దున్నేశాడు. యాదమరి మండలం పెరుమాళ్ళపల్లెకు చెందిన రాజశేఖర రెడ్డి 2.30 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు చేశాడు. పంట చేతికొచ్చే దశలో ఇటీవల కురిసిన భారీవర్షాలకు పొలాలన్నీ నీట మునిగిపోయాయి. రోజుల తరబడి పొలంలో నీరు నిలిచిపోవడంతో వరి పూర్తిగా కుళ్ళిపోయి, కోలుకోలేని విధంగా నష్టం వాటిల్లింది. దీంతో పంటను పొలంలో ఉంచినా ప్రయోజనం లేదని భావించిన రాజశేఖర రెడ్డి తీవ్ర మనోవేదనతో శనివారం తన వరిపంటను ట్రాక్టర్‌తో దున్నేశాడు.ప్రభుత్వం స్పందించి నష్టపోయిన ఇలాంటి రైతులకు పరిహారం అందించి ఆదుకోవాల్సివుంది.

## మసీదు రోడ్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నెల్..

**నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చిట్టిబాబు..**
**ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదు కు ధన్యవాదలు తెలిపిన ముస్లిం నాయకులు..**



**ఎన్టీఆర్ జిల్లా,కొండపల్లి మున్సిపాలిటీ,నవంబర్ 08(క్రైం కౌంటర్ డెస్క్):** పశ్చిమ ఇబ్రహీంపట్నం లోని మసీదు రోడ్ గుంటలు పడి రోడ్డు అధ్వానంగా తయారైంది.స్టానికులు కౌన్సిలర్ రావి అనూష దృష్టికి తీసుకు రాగా, ఆమె చైర్మన్ చిట్టిబాబు దృష్టి తీసుకు వచ్చారు.ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు పదహారు లక్షల సిఆర్డిఏ నిధులతో రోడ్ నిర్మాణానికి శనివారం నాడు చైర్మన్ చిట్టిబాబు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపల్లి మునిసిపాలిటీ అభివృద్ధికి తాను కృషి చేస్తానని, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో రావి మణిరాజ్(ఫణి),స్థానిక ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ 'రెడ్ శాండిల్'!

శనివారం నాటి తిరుపతి పర్యటనలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాటల ఉద్దేశంలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టాలన్న ప్రభుత్వ వైఖరిని స్పష్టంచేసింది. ఆపరేషన్ కగార్ తరహాలో త్వరలోనే స్మగ్లర్లపై చర్యలు ఉంటాయనీ ఆయన స్పష్టం చేశారు.

శేషాచల అడవుల నుంచి అంతర్జాతీయ మార్కెట్ దాకా పాతుకుపోయిన నెట్‌వర్క్‌తో వేల కోట్ల రూపాయల వ్యాపారం సాగిస్తున్న ఎర్రచందనం స్మగ్లర్లపై రాష్ట్ర ప్రభుత్వం మరోమారు ఉక్కుపాదం మోపే పరిస్థితి కనిపిస్తోంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుపతి నుంచి జారీ చేసిన హెచ్చరికలతో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటన్నది స్పష్టమైపోయింది. ఆయన తిరుపతి పర్యటన, సంబంధిత శాఖతో నిర్వహించిన సమీక్షలతో అధికార యంత్రాంగపై ఒత్తిడి పెరిగింది. పవన్ ఆహార్యం ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రభుత్వ కఠిన వైఖరిని బలంగా చాటినట్టయింది. దీంతో 2014-19 నాటి టీడీపీ ప్రభుత్వ తరహాలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను కఠినంగా అడ్డుకునే ప్రయత్నాలు మళ్లీ మొదలైనట్టుగా భావించాల్సి వస్తోంది. మామండూరు అటవీ ప్రాంతంలో పర్యటించిన అనంతరం తిరుపతి మంగళంలోని ఎర్రచందనం గోదామును తనిఖీ చేశారు. అక్కడి భారీ పరిమాణంలో పోగుపడిన ఎర్రచందనం దుంగలను చూసి నిశ్చేష్టులయ్యారు. ఎన్ని లక్షల చెట్లు నరికి వుంటే ఇన్ని దుంగలు పట్టుబడ్డాయంటూ తీవ్ర వేదనకు లోనయ్యారు. ఇక పట్టుబడకుండా సరిహద్దులు దాటిన దుంగల పరిమాణం తలచుకుని ఆవేదన చెందారు.

వేంకటేశ్వరస్వామి సెంటిమెంట్‌తో..

'తిరుమలలో శ్రీవారికి గాయమైనపుడు వచ్చిన రక్తంతో ఎర్రచందనం చెట్లు పుట్టాయి. అందుకే శేషాచలంలో తప్ప ప్రపంచంలో మరెక్కడా అవి కనిపించవు' అన్న పవన్ వ్యాఖ్యల వెనుక.. ఎర్రచందనాన్ని వేంకటేశ్వరస్వామితో ముడిపెట్టి ఆ సెంటిమెంట్‌తో కాపాడేందుకు ప్రయత్నించినట్టుగా కనిపిస్తోంది. అందుకనే శేషాచలం అడవుల్లోని పవిత్ర ఎర్రచందనం వృక్షాలను నరకొద్దంటూ స్మగ్లర్లతో పాటు వారికి సహకరించే స్థానికులకు సైతం విజ్ఞప్తి చేయడం అందరినీ ఆకట్టుకుంది.

ఆపరేషన్ కగార్‌ను గుర్తుచేస్తూ..

ఎర్రచందనం వృక్షాల నరికివేత కొనసాగితే ఆపరేషన్ కగార్ తరహాలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి స్మగ్లర్ల తాటతీస్తామని పవన్ హెచ్చరించారు. కూంబింగ్, నిఘా, తనిఖీలు వంటివి పటిష్టంగా చేపట్టాలని, చెట్ల నరికివేతను ఆపడానికి కఠినంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం ఆదేశాలు, చర్యలు గత టీడీపీ ప్రభుత్వ చర్యలను గుర్తుకు తెస్తున్నాయి.

గత టీడీపీ పాలనలో ఏం జరిగిందంటే..

2004-2014 నడుమ పదేళ్ల పాటు శేషాచల అడవుల్లో ఎర్రచందనం వృక్షాల నరికివేత ఇష్టారాజ్యంగా సాగింది. ఎక్కడికక్కడ అప్పటి అధికార పార్టీకి చెందిన స్థానిక నేతలు స్మగ్లర్లకు కీలకంగా సహకరించారు. పొరుగు రాష్ట్రాలకు చెందిన స్మగ్లర్ల కోసం చెట్లు నరికేందుకు స్థానికంగా కూలీలను సమకూర్చారు. స్మగ్లర్ల నుంచీ వాటాలు తీసుకుని ఆర్థికంగా బలపడ్డారు. మరికొందరు నేరుగా తామే స్మగ్లర్ల అవతారం ఎత్తారు. వారిలో కొందరు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగానూ ఎన్నికయ్యారు. ఎన్నికల్లోనూ స్మగ్లర్ల డబ్బు కీలక పాత్ర పోషించింది. అయితే 2014లో టీడీపీ ప్రభుత్వం రావడంతో పరిస్థితి మొత్తం మారింది. సీఎం చంద్రబాబు కన్నెర్ర చేయడంతో పోలీసులు స్మగ్లర్లను అరెస్టు చేయడమే కాదు పీడీ యాక్టు ప్రయోగించారు. అందులో కొందరు టీడీపీ నేతలున్నా ప్రభుత్వం ఖాతరు చేయలేదు. టాస్క్‌ఫోర్స్‌ను బలోపేతం చేశారు. ఐజీ స్థాయి అధికారిని అధిపతిగా నియమించారు. సిబ్బంది సంఖ్యను పెంచి, ఆయుధాలు కూడా అందించారు. అప్పట్లో శేషాచల అడవుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్ దెబ్బకు తమిళనాడు నుంచీ కూలీలు రావడం ఆగిపోయింది. ఇపుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీరు సరిగ్గా నాటి ప్రభుత్వ నిర్ణయాలను గుర్తు చేస్తోంది. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం కూడా కఠిన వైఖరి తీసుకుంటోందనే సంకేతాలను ఇస్తోంది.

టాస్క్‌ఫోర్సు యూనిఫామ్‌లా..

రెడ్ శాండర్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ధరించే యూనిఫామ్‌ను పోలిన ప్యాంటు వేసుకుని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జిల్లా పర్యటనకు వచ్చారు. అది టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, అధికారుల్లో ఉత్తేజాన్ని నింపింది.

గుంటి మడుగు వాగులోన..

మామండూరు అటవీ గెస్ట్‌హౌస్ నుంచి దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉండే గుంటి మడుగు వాగు వద్దకు అధికారులతో కలసి పవన్ వెళ్లారు. వాగు ఒడ్డున కూర్చుని, పారే నీటిలో కాళ్లను ఆడిస్తూ ఆహ్లాదంగా గడిపారు. పరిసరాలను ఆసక్తిగా తిలకించారు. వాగుకు రెండువైపులా ఉన్న చెట్ల వివరాలపై ఆరాతీశారు. ఎర్రచందనం స్మగ్లింగ్, స్మగ్లింగ్ నిరోధక ఆపరేషన్స్, టాస్క్‌ఫోర్స్ అటవీ సిబ్బంది కూంబింగ్ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## బైపాస్ రోడ్డు స్మశాన వాటిక స్నానాల ఘట్టానికి లంకిశెట్టి ఫ్రెండ్ సర్కిల్ చేయుత....

**మచిలీపట్నం, (క్రైమ్ కౌంటర్ )నవంబర్ 8:** మచిలీపట్నం బైపాస్ రోడ్డు హిందూ స్మశాన వాటిక లోని స్నానాల ఘట్టాన్ని పునర్మించి పంపులు షవర్ల కోసం లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ ఉపాధ్యక్షులు విశ్రాంత విఆర్ఓ లంకిశెట్టి సాయిబాబు సాయి లక్ష్మి దంపతులు 72 వేల రూపాయలుతో అభివృద్ధి చేయటం అభినందనీయమని మచిలీపట్నం మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ అన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర సహకారంతో స్మశానానికి కోటి రూపాయలతో అభివృద్ధి పరుస్తున్నట్లు ఆయన తెలియజేశారు. దాత లంకిశెట్టి సాయిబాబు మాట్లాడుతూ 12 సంవత్సరాల క్రితం తమ కుటుంబ సభ్యులు అందరం కలిసి మొట్టమొదటి మార్చురి బాక్స్ ని అందించామని తెలియజేశారు. ప్రస్తుతం అంత్యక్రియలు అయిన తర్వాత స్నానానికి నగర ప్రజలు పడుతున్న ఇబ్బందిని ప్రత్యక్షంగా చూసి తన సొంత నిధులతో 72 రూపాయలు కేటాయించి



స్నానాలు ఘటానికి కొత్త టైల్స్ కొత్త పంపులు షవర్లు వేయించినట్లు తెలియజేశారు. ఫ్రెండ్స్ సర్కిల్ కన్వీనర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ మచిలీపట్నంలో అన్ని మతాల యొక్క స్మశానాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించి అభివ

## ప్రజల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది..

### ఎమ్మెల్యే బొండా ఉమా



**విజయవాడ ,(క్రైమ్ కౌంటర్) నవంబర్ 8** సింగ్ నగర్ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు శనివారం పలువురు లబ్ధిదారులకు .?7,48,358/- రూపాయల విలువ చెక్కులను ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు స్వయంగా అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలెవరూ వైద్య ఖర్చుల నిమిత్తం అప్పులు పాలు కాకూడదన్న సీఎం చంద్రబాబు ఆలోచన మేరకు సెంట్రల్ ఎమ్మెల్యే కార్యాలయంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి కింద ప్రజలకు సకాలంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసి లు అందజేస్తున్నాము.2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎన్నికైన తర్వాత, పేదల సమస్యలకు పరిష్కారం చూపిస్తు, ప్రజల కష్టాలను తీరుస్తు, అధికారం కేవలం అలంకారం కాకుండా, గొప్ప బాధ్యతగా తాను, కార్యాలయం ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తూ, వారి కష్టాలను తీర్చడానికి కృషి చేస్తున్నాము.గతంలో, 2014-2019 మధ్య తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా దాదాపు 30 కోట్ల రూపాయలు ప్రజలకు సహాయం చేశాం. 2024 లో అధికారం లోకి వచ్చిన 17 నెలల్లో, దాదాపు 3 కోట్ల రూపాయలకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్కులు తీసుకొని ప్రజలకు అందిస్తు, ఆపదలో సహాయం కోసం వచ్చిన ప్రతి అర్జీని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, చెక్కులు లబ్ధిదారులకు అందజేస్తున్నాము.ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యాము. వారి కష్టాలను తీర్చడంలో కృషి చేస్తున్నాము.ప్రజల సంక్షేమమే మా లక్ష్యం, వారి ఆశీస్సులతోనే ముందుకు సాగుతాం, ప్రతి ఒక్కరి సమస్యను వ్యక్తిగతంగా పరిగణించి, పరిష్కారం చూపడానికి ప్రయత్నిస్తు, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి, వారి ఆకాంక్షలను నెరవేర్చడానికి మేము కట్టుబడి ఉన్నాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో 58వ డివిజన్ అధ్యక్షులు కూర్మాపు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి మల్లంపాటి రవికుమార్, ఇంచార్జ్ పిరియ సోమేశ్వరరావు, 24వ డివిజన్ ప్రధాన కార్యదర్శి గుడ్డేటి మురళి, గడ్డం రాజు, గాజుల రవి, 24వ డివిజన్ మహిళా అధ్యక్షులు దుర్గా, సుల్తానా, రజిని, తదితరులు పాల్గొన్నారు.

# పంటకాలువలో గల్లంతైన యువకుడు మృతి

**ప్రమాదం జరిగిన 23 గంటలకు లభ్యమైన మృతదేహం**
**చిన్న యాదరకు ఆరు కిలోమీటర్ల దూరంలో లభించిన మృతదేహం**
**పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించిన పోలీసులు**
**కన్నీరు మున్నీరుగా వినిపిస్తున్న కుటుంబ సభ్యులు**



**మచిలీపట్నం, (క్రైమ్ కౌంటర్ )నవంబర్ 8:** బందరు మండలం చినయాదర గ్రామంలోని పంట కాలువలో గల్లంతైన అయ్యప్ప భక్తుడు మృతదేహాన్ని పోలీసులు ఎట్టకేలకు గుర్తించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. చినయాదర గ్రామానికి చెందిన రాసంశెట్టి సుధాకర్ (24) తన స్నేహితులతో కలిసి ఇటీవల అయ్యప్ప మాల ధరించాడు. ప్రతిరోజు లానే శుక్రవారం సాయంత్రం పీఠం వద్ద పూజ చేసుకునే కార్యక్రమంలో భాగంగా పంట కాలువలో స్నానం ఆచరించేందుకు తోటి అయ్యప్పలతో కలిసి వెళ్ళాడు. అయ్యప్పలంతా స్నానం ఆచరించి పూజ నిమిత్తం పీఠం వద్దకు చేరుకున్నారు. పూజా కార్యక్రమం ప్రారంభంలో సుధాకర్ లేకపోవడాన్ని గమనించిన తోటి అయ్యప్పలు అనుమానంతో హుటాహుటిన వంటకాలువ వద్దకు వెళ్లారు. పంట కాలువ గట్టుపై సుధాకర్ ద్విచక్ర వాహనం ఉండడంతో పాటు అతని దుస్తులు గట్టుపైన కనిపించాయి. మరింత అనుమానం వచ్చిన అయ్యప్పలు విషయాన్నీ కుటుంబ సభ్యులతో పాటు గ్రామ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. సుధాకర్ వంటకాలవలో గల్లంతయినట్లు తెలుసుకున్న గ్రామ పెద్దలు కాలువ వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. జరిగిన సంఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. నిన్న సాయంత్రం 6 గంటల నుండి గాలింపు చర్యలు చేపట్టగా చిన్నయాదర గ్రామానికి ఆరు కిలోమీటర్ల దూరంలోనీ కొత్త వాడపాలెం 9/8 కాలువ వద్ద రెస్క్యూ టీం సిబ్బంది సుధాకర్ మృతదేహాన్ని గుర్తించారు. పంట కాలువలో పడి సుధాకర్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా విలపించారు. సుధాకర్ మృతితో చిన్న యాదర గ్రామం ఒక్కసారిగా విషాదంలో మునిగిపోయింది. మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు రూరల్ ఎస్సై నాగరాజు తెలిపారు..

# కళత్తూరు దళితవాడలో మట్టి తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు



కేవీబీపురం, నవంబరు 8 : కేవీబీపురం మండలం కళత్తూరు దళితవాడలో ఇంకా బురద తొలగలేదు. గురువారం ఓళ్లూరు రాయలచెరువు తెగడంతో వచ్చిన నీటి ప్రవాహంతో ఊరంతా బురదమయంగా మారింది. శనివారం ఉదయం నుంచీ డీపీవో సుశీలాదేవి ఆధ్వర్యంలో సహాయక చర్యలు చురుగ్గా సాగుతున్నాయి. ఇళ్లలో పేరుకుపోయిన బురద తీయడానికి ప్రత్యేక కార్మికులను ఏర్పాటు చేశారు. వీధుల్లో బురదను ట్రాక్టర్ల ద్వారా తొలగించి శుభ్ర పరిచారు. డిస్కం ఏఈ మునికుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ పునరుద్ధరణకు అధికారులు, సిబ్బంది విశేష కృషి చేస్తున్నారు. 133 పశువులకువైద్యాధికారి పార్థిబన్ ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ వేశారు. వైద్యాధికారి రామనాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ఇంటింటికి రోగ నివారణ మందులను పంపిణీ చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించారు. ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. తహసీల్దారు రోశయ్య ఆధ్వర్యంలో పాతపాళెం అరుంధతివాడలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.బురదలోనే వాహనాలుకళత్తూరు దళితవాడలో సుమారు 20 ట్రాక్టర్లు కొట్టుకుపోయి చెరువు, పొలాల్లో పడ్డాయి. సుమారు 150 ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి. ఇవన్నీ బురదలో కూరుకుపోయి పనికిరాకుండా పోయాయి. ఈ పొలంలో సాగు చేసేదెట్టా?రాళ్లు తేలిపోయి, మట్టి కొట్టుకుపోయి, ఇసుక మేట వేసిన ఈ పొలం పాతపాళేనికి చెందిన డిల్లీబాబుది. పొలం ఆనవాళ్లు లేకుండా పోయింది. ఇంకా ఆదెమ్మ రెండు ఎకరాల చెరకు పంట దెబ్బతిని మట్టి, ఇసుక పొలంలో మేట వేసింది. చంద్రారెడ్డి బావి, పొలం మేట వేసి మట్టి చేరిపోయింది. ఆ పొలాల్లో సాగు చేయాలంటే ఎంత ఖర్చవుతుందో చెప్పలేం. సుమారు 800 ఎకరాల వరకు మేట వేసి పొలాలు మొత్తం పనికిరాకుండాపోయాయి.వేగంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు ఓళూరు చెరువు తెగి ముంపునకు గురైన ప్రాంతాల్లో తమ సిబ్బంది యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారని సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్ శనివారం చెప్పారు. 'కేవీబీ పురంలోని 33-11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మునగడంతో కళత్తూరు, ఎస్ఎల్‌పురం, పిసీకెపురం, రంగయ్యగుంట, రాజులకండ్రిగ, కొటాలమిట్ట తదితర గ్రామాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. 223 విద్యుత్ స్తంభాలు, 78 ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతిన్నాయి. దీంతో 2093 (వ్యవసాయ, గృహ, తాగునీటి) సర్వీసులకు సరఫరా ఆగింది. శుక్రవారం రాత్రికి 89 స్తంభాలు, 78 ట్రాన్స్‌ఫార్మర్లు పునరుద్ధరించి 1353 విద్యుత్ సర్వీసులకు సరఫరా ఇచ్చాం. మిగిలిన సర్వీసులకు శనివారం పూర్తి చేశాం. దీనికోసం రెండు రోజులు శ్రమించిన అధికారులు, సిబ్బందికి అభినందనలు' అని శివశంకర్ పేర్కొన్నారు.

# అనకాపల్లి సమీపంలో ఖాళీగా వున్న ఇసుక పాయింట్



**అధికారంలో ఉన్న పార్టీల నేతలతో చెట్టపట్టాల్**
**ఉచితం' మాటున నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు**
**ప్రభుత్వ డిపోల్లో కన్నా తక్కువ రేటుకు విక్రయం**
**అక్రమార్కులకు అధికార పార్టీ నేతల అండదండలు**
**చర్యలకు వెనుకాడుతున్న అధికారులు**
**అమ్మకాలు లేక వెలవెలబోతున్న అధికారిక స్టాక్ పాయింట్లు**

వర్షాకాలం ముగియడంతో ఇసుకాసురులు సహజవనరుల దోపిడీని మొదలుపెట్టారు. నదులు, గెడ్డల్లో వరద తగ్గుముఖం పట్టి, ఇసుక మేటలు బయటపడడంతో తవ్వకాలకు తెగబడుతున్నారు. ఏ పార్టీ అధికారంలో వున్నా.. ఇసుక దోపిడీ మాత్రం ఆగడంలేదు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానికి తూట్లు పొడుస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వం రవాణా చార్జీలు మాత్రమే తీసుకుని గోదావరి నది నుంచి ఇసుకను తీసుకువచ్చి ఉచితంగా అందజేయడానికి డిపోలు ఏర్పాటు చేయగా, అక్రమార్కులు స్థానికంగా ఉన్న గెడ్డలు, నదుల్లో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుపుతూ దర్జాగా అమ్ముకుంటున్నారు. దీంతో ప్రభుత్వ అనుమతితో ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్ పాయింట్లు వెలవెలబోతున్నాయి.

జిల్లాలోని నదుల్లో తగినంత ఇసుక నిల్వలు లేకపోవడంతో ఇసుక రీచ్‌లకు పర్యావరణ శాఖ అనుమతి ఇవ్వలేదు. అయితే జిల్లా వాసుల భవన నిర్మాణాలు, ఇతర కట్టడాల పనులకు గోదావరి నది నుంచి ఇసుకను రప్పించి, వివిధచోట్ల ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇసుక తవ్వకాలు, రవాణా, విక్రయ బాధ్యతలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. వీరు రవాణా చార్జీలు, సీనరేజీ చార్జీలు మాత్రమే వేసుకుని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఇసుక విక్రయించాలి. గోదావరి నదిలో ఇసుక రీచ్‌ల నుంచి జిల్లాలోని ఆయా స్టాక్ పాయింట్లకు వున్న దూరాన్నిబట్టి టన్నుకు రూ.700 నుంచి రూ.900 వరకు ధర నిర్ణయించింది. వైసీపీ హయాంలో ఇదే ఇసుకను టన్ను రూ.1,450కి విక్రయించిన విషయం ఈ సందర్భంగా గమనార్హం. దీంతో పోలిస్తే కూటమి ప్రభుత్వం చాలా తక్కువ రేటుకు ఇసుకును అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే వైసీపీ హయాంలో ఇసుక మాఫియా ఆ పార్టీ నేతలతో కుమ్మక్కై జిల్లాలోని అన్ని నదుల్లో ఇసుకను యథేచ్ఛగా తవ్వుకుని అమ్ముకున్నారు. ఇప్పుడు కూటమి పాలనలో ఆయా పార్టీల నేతల అండదండలతో అదే మాఫియా ఇసుక దోపిడీకి పాల్పడుతున్నది. నదులు, గెడ్డల్లో ఇసుక తవ్వకాలు జరుపుతూ టన్ను రూ.600కు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ డిపోల్లోని ఇసుక కంటే తక్కువ ధరకు వస్తుండడంతో ఎక్కువ మంది భవన నిర్మాణదారులు స్థానిక ఇసుకనే కొనుగోలు చేస్తున్నారు. కొన్ని మండలాల్లో ఇసుక రీచ్‌లను (అనధికారికంగా) నిర్వహించుకొనేందుకు వేలం పాటలు పెడుతున్నారు.

'ఉచిత' వెసులుబాటు మాటున అక్రమాలు

ఇసుక స్టాక్ పాయింట్లకు దూరంగా వున్న గ్రామాల్లో నిర్మాణ పనులకు ఇసుక అవసరమైన వారు స్థానికంగా వున్న నదులు, గెడ్డల్లో నుంచి తవ్వి తీసుకెళ్లడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే స్థానిక సచివాలయంలో అనుమతులు తీసుకుని, 24 గంటల్లో నిర్ణీత మొత్తంలో ఇసుకను తవ్వి తీసుకెళ్లాలి. అయితే ప్రభుత్వం ఇచ్చిన ఈ వెసులుబాటును అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. రాజకీయ అండదండలతో సచివాలయాల సిబ్బందిని తమ గుప్పెట్లో పెట్టుకుని ఎడాపెడా అనుమతులు పొందుతున్నారు. నదుల్లో ఇసుక తవ్వకాలు జరుపుతూ దర్జాగా అమ్ముకుంటున్నారు. వాస్తవానికి ఉచిత ఇసుకను ఎడ్ల బండ్లతోనే తీసుకెళ్లాలి. కానీ ట్రాక్టర్లు, లారీల్లో ఇసుక రవాణా చేస్తున్నారు. దీనిపై సంబంధిత శాఖల అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఇసుక స్టాక్ పాయింట్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కొన్నిచోట్ల ఇసుక అమ్మకాలు ఆపేశారు. మరికొన్నిచోట్ల స్టాక్ పాయింట్లను స్థానిక నేతలకు అప్పగించేశారు.

అనకాపల్లి స్టాక్ పాయింట్‌లోరోజుకు 10 నుంచి 20 లోడ్‌ల ఇసుక అమ్మకాలు జరిగేవి. అక్రమ తవ్వకందారులు ఇక్కడ కన్నా తక్కువ రేటుకు ఇసుక సరఫరా చేస్తుండడంతో ఈ కేంద్రంలో అమ్మకాలు బాగా తగ్గిపోయాయి. చోడవరం మండలం నర్సాపురంలో ఏర్పాటు చేసిన ఇసుక నిల్వ కేంద్రంలో రోజుకు ఒక్క లోడు కూడా పోవడం లేదు. సమీపంలో గజపతినగరం, గవరవరం, తగరంపూడి, సీతానగరం గ్రామాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతుండడమే ఇందుకు కారణం. గ్రామీణ ప్రాంతాల్లో అధికార, విపక్ష నేతలు కుమ్మక్కై ఇసుక తవ్వకాలు జరిపిస్తుండడంతో గనులు, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు కట్టడి చేయలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై గనుల శాఖ ఏడీ శ్రీనివాసరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఇసుక రీచ్‌లకు ఎక్కడా అనుమతి లేదన్నారు. అయితే పేదల ఇళ్ల నిర్మాణాలకు సమీపంలోని నదుల్లో నుంచి ఇసుక తవ్వి తీసుకెళ్లే వెసులుబాటు కల్పించిందన్నారు. నదుల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపితే కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు.

# దారి..చూపారు! కాకినాడ టూ పుదుచ్చేరి

**బకింగ్‌హం కెనాల్‌కు మంచిరోజులు**
**పురాతన జలరవాణాకు పచ్చజెండా**
**ఐడబ్ల్యూఏఐతో సర్కారు ఒప్పందం**
**రూ.80 కోట్లతో కాలువ అభివృద్ధి**
**ఐదేళ్ల పాటు ఎంవోయూ అమలు**



కాకినాడ–పుదుచ్చేరి బకింగ్‌హం కాలువకు ఎట్టకేలకు మంచి రోజులొచ్చాయి. ఈ మార్గంలో గోదావరి,కృష్ణా నదుల మీదుగా సరుకు రవాణా, పర్యాటక అభివృద్ధికి వేగంగా అడుగులు పడు తున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత మళ్లీ ఈ కాలువకు పూర్వ వైభవం తెచ్చే దిశగా రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు కాలువ అభి వృద్ధికి ఇన్నేళ్లకు ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథా రిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) రాష్ట్ర ప్రభు త్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇటీవల ముంబైలో జరిగిన మారిటైం సదస్సులో ఎంవో యూ కుదిరింది. ఐదేళ్ల పాటు అమల్లో ఉండ నున్న ఒప్పందం మేరకు ఈ రెండూ కలిసి బ కింగ్‌హం కెనాల్ అభివృద్ధి, జల రవాణా మార్గాల అన్వేషణ, కాలువల డ్రెడ్జింగ్, రివర్ క్రూయిజ్ పర్యాటకాన్ని ఉమ్మడిగా అభివృద్ధి చేయనున్నాయి. తొలుత రూ.80 కోట్లతో కాలువ అభివృద్ధికి ఐడబ్ల్యూఏఐ శ్రీకారం చుట్టనుంది.

ఒప్పందాలు ఇలా..

జల రవాణాకు డిమాండ్ పెరగడం, కారు చౌక రవాణామార్గం కావడంతో కాలువను అభి వృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణ యిం చారు. ఈ మేరకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కాలువలను అభివృద్ధి చేసే ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) తోను చర్చలు జరిపారు. ఈ మేరకు వారం కిందట ముంబైలో జరిగిన మారిటైం సదస్సులో కాలువను రూ.80 కోట్లతో అభివృద్ధి చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఒప్పందం ఐదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. నౌకల రాకపోకలకు వీలుగా కాలు వల్లో పూడిక తీయడం, ఓడలు రాకపోకలు సాగించేలా వెస్సల్ ట్రాఫిక్ మేనేజ్ మెంట్ సిస్టం ఏర్పాటు, నావిగేషన్ వ్యవస్థ తీర్చిదిద్దడం, కాలువల్లో రివర్ క్రూయిజ్‌లు నడిపేలా సహా యపడడం వంటివన్నీ మౌలిక సదుపాయాల రూపంలో తీర్చిదిద్దనుంది. సెకం డ్‌పార్టీ కింద రాష్ట్రప్రభుత్వం తరపున జల రవాణా మార్గాన్ని అభివృద్ధి చేసిన తర్వాత రివర్ క్రూయిజ్ నౌకలు బెర్తింగ్ అవడానికి కావాల్సిన భూముల కేటా యింపు, బకింగ్ హం కాలువలో డ్రెడ్జింగ్ తర్వాత తవ్వితీసిన భారీ బురద, మట్టిని నిల్వ చేసేందుకు తగిన స్థలాలు, సరుకు రవాణా, పర్యాటక నౌకల రాక పోకలు, వెస్సల్ ట్రాఫిక్ పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంది. ఐదేళ్ల పాటు ఇవన్నీ ఈ రెండు ఒప్పందం ప్రకారం చేయా లని ఎంవోయూలో ప్రస్తావించారు. ఈ నేపథ్యం లో ఇన్నేళ్ల తర్వాత బకింగ్ హం కెనాల్ అభి వృద్ధికి మార్గం సుగ మం కానుంది.

నాడు ఎంతో ప్రసిద్ధి

కాకినాడ–పుదుచ్చేరి బకింగ్‌హం కాలువ బ్రి టిష్ కాలంలో ఎంతో ప్రఖ్యాతి చెందింది. కాకి నాడ నుంచి మొదలయ్యే ఈ కాలువ గోదా వ రి, కృష్ణా మీదుగా తమిళనాడులోని విల్లుపు రం వరకు 796 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. మన రాష్ట్ర పరిధిలో 257 కి.మీ. వరకు ఉంది. కాకినాడ నుంచి గోదావరి మీదుగా తమిళనాడు వరకు అప్పట్లో జల రవాణా కింద సరుకులు భారీగా ఎగుమతి,దిగుమతి అయ్యే వి. అయితే క్రమేపీ కాలువ పూర్తిగా పూడుకు పోవ డంతో ప్రభుత్వాలు గాలికొదిలేశాయి.

జలదారులివే..

కాకినాడ నుంచి రాజమహేంద్ర వరం, రాజమహేంద్రవరం–విజయవాడ, రాజమహేంద్ర వరం నుంచి భద్రాచలం, అంతర్వేది నుంచి నరసాపురం, నర సాపురం నుంచి సఖినేటిపల్లి, కోటిపల్లి– ముక్తేశ్వరం, నిడదవోలు నుంచి ఏలూ రు వరకు జలరవాణా రూట్లను గుర్తించారు. ఈ మార్గాల్లో పలు పరిశ్రమలకు కార్గో రవా ణాతో పాటు పర్యాటక బోట్లను నడిపేందుకు అనుమతులిస్తూ ఆసక్తి కలిగిన సంస్థలను ఆహ్వానించారు. కాకినాడ నుంచి విజయవాడ, రాజమ హేంద్రవరం నుంచి భద్రాచలంతో పాటు పలు ఇతర మా ర్గాల్లోను భారీ రివర్ క్రూయిజ్‌లను నడపవచ్చని ప్రతి పాదించారు. ఇటీవల ఎంపిక చేసిన జల రవాణా మార్గాల్లో వ్యాపారాలు చేయడానికి కొన్ని కంపెనీలు ముందుకు వచ్చాయి. కింగ్‌హం కాలువ అభివృద్ధి పనులు పట్టాలెక్కిన తర్వాత వీటితో చర్చలు జరిపి సరకు, పర్యాటక రవాణాకు సంబంధించి పూర్తిస్థాయి కార్యాచరణ చేపట్టనున్నారు.

ఎన్ని అవకాశాలో..

బకింగ్‌హం కాలువ ద్వారా సరుకు రవా ణాకు మళ్లీ ఊపిరిలూదాలని 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం భావించింది. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ప్రతిపాదనలన్నీ మూల నపడిపోయాయి. మళ్లీ ఇప్పుడు సీఎం చంద్ర బాబు బకింగ్‌హం కాలువ అభివృద్ధికి ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ముందుకు వచ్చేలా ఒప్పించారు. ఒప్పందానికి ముందే ప్రభుత్వం తరపున పది జల రవాణా మార్గాలను ఎంపిక చేసి అభివృద్ధి చేసే లా ప్రైవేటు సంస్థలను టెండర్ల ద్వారా ఆహ్వానిం చింది. ఈ మార్గాల్లో డ్రెడ్జింగ్ అనంతరం రవాణా కార్యకలాపాలు ప్రైవేటు సంస్థలు సాగించేలా నిబంధనలు రూపొందించారు.

# నాసిరకంగా బడి భోజనం

**అన్నంలో పెంకు పురుగులు**
**అరకొరగా భోజనం చేస్తున్న విద్యార్థులు**
**నిర్వాహకులకు చెప్పినా పట్టించుకోవడం లేదంటున్న హెచ్‌ఎం**



నర్సీపట్నం, నవంబరు 8: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చాలా నాసిరకంగా వుందని, అన్నంలో పురుగులు వుంటున్నాయని, తినలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూను ఇక్కడ అమలు చేయడం లేదని ఆరోపిస్తున్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థిని అల్లు రామ సంతోషి అన్నంలో కనిపించిన పెంకు పురుగులను ఉపాధ్యాయుడుకి చూపించి, భోజనం బాగుండడంలేదని ఫిర్యాదు చేసింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం 246 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండారు. మెనూ ప్రకారం వైట్ రైస్, చారు, కూరగాయ కూర, తీపి పొంగలి, రాగి జావ పెట్టారు. చారుకి, నీళ్లకు తేడా లేకుండా వుందని, రుచీపచీ లేదని విద్యార్థులు చెబుతున్నారు. ఏ కూరగాయతో కూర వండారో చెప్పలేని విధంగా వుందని అన్నారు. ఈ రోజే కాదని.. నిత్యం ఇదే పరిస్థితి అని, కూరలు ఒక్క రోజు కూడా బాగుండడం లేదని వాపోయారు. చాలా మంది విద్యార్థులు అరకొరగా భోజనం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ మధ్యాహ్న భోజనం పథకంలో పలు మార్పులు తీసుకువచ్చారు. పిల్లలకు రుచికరమైన, నాణ్యమైన పౌష్టికాహారం పెట్టాలని అధికారులకు ఆదేశించించారు. బడి భోజనానికి సన్న బియ్యం సరఫరా చేస్తున్నారు. కానీ భోజన పథకం నిర్వాహకులు మెనూను సక్రమంగా అమలు చేయడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉడికించిన కోడిగుడ్డును అన్నతోపాటు ప్లేటులో వడ్డించాలి. కానీ కోడిగుడ్లను పక్కన పెట్టి, పిల్లలను తీసుకోమంటున్నారు. చాలా మంది విద్యార్థులు భోజనం వడ్డించుకొని గుడ్డు వదిలేస్తున్నారు. వేరుశనగ చిక్కీలు కూడా స్వయంగా విద్యార్థులకు అందజేయడం లేదు. దీని వలన విద్యార్థులు పౌష్టికాహారానికి దూరమవుతున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలుతీరుపై పాఠశాల హెచ్‌ఎం (ఎంఈవో–1) తలుపులును వివరణ కోరగా.. భోజనం నిర్వాహకులకు చాలాసార్లు చెప్పామని, కానీ వారిలో మార్పు రావడం లేదని అన్నారు.

# త్వరలో అధునాతన వైద్యం

**డయాలసిస్, బర్న్, హైరిస్క్ వార్డులు**
**ఆధునిక ఎక్స్‌రే ప్లాంట్, అల్ట్రాస్కాన్**
**ఈ నెలాఖరుకు భవనం అప్పగించనున్న కాంట్రాక్టర్**
**వైద్య పరికరాలు అమర్చిన వెంటనే సేవలు ప్రారంభం**

అనకాపల్లి టౌన్, నవంబరు 8 స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో 50 పడకలతో నిర్మితమవుతున్న క్లిష్టతర వ్యాధుల సంరక్షణ విభాగం (క్రిటికల్ కేర్ బ్లాక్–సీసీబీ) ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్నది. దీనిని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.22.25 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.15 కోట్ల వరకు భవన నిర్మాణానికి ఖర్చు చేయగా రూ.7 కోట్లతో అధునాతన వైద్య పరికరాలను సమకూరుస్తున్నారు. సీసీబీలో డయాలసిస్ యూనిట్, బర్న్‌వార్డు, హైరిస్క్ వార్డు, ఆపరేషన్ థియేటర్లు వుంటాయి. ఎక్స్‌రే ప్లాంట్, అల్ట్రాస్కాన్ వంటి పరికరాలు అందుబాటులోకి రానున్నాయి. భవనం మొత్తానికి ఏసీ సదుపాయం వుంది.

జాతీయ రహదారిపైన, పరిశ్రమల్లో సంభవించిన ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారిని తొలుత అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకువస్తుంటారు. అయితే ఇక్కడ అధునాతన వైద్య పరికరాలు, సూపర్ స్పెషాలిటీ వైద్యులు లేకపోవడంతో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి, విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారు. దీనివల్ల సకాలంలో వైద్యం అందక పలువురు మృత్యువాత పడుతున్నారు. దీనిని నివారించడానికి, క్షతగాత్రులకు ఇక్కడే మెరుగైన వైద్యం అందించడానికి అత్యాధునిక పరికరాలతో 'క్లిష్టతర వ్యాధుల సంరక్షణ విభాగాన్ని' అందుబాటులోకి తీసుకురానున్నారు. వాస్తవంగా క్రిటికల్ కేర్ బ్లాక్ గత ప్రభుత్వ హయాంలోనే మంజూరుకాగా.. పనులు చాలా మందకొడిగా సాగాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనులు వేగవంతం చేయించారు. భవన పనులు చాలా వరకు పూర్తయ్యాయి. ఆధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేసిన వెంటనే దీనిని ప్రారంభిస్తారని తెలిసింది. సీసీబీ సేవలు ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తాయని డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా.. కాంట్రాక్టర్ అన్ని పనులు పూర్తిచేసి ఈ నెలాఖరుకు భవనాన్ని అప్పగిస్తారని చెప్పారు. అధునాతన వైద్య పరికరాలు వస్తున్నాయని, కాంట్రాక్టర్ భవనం అప్పగించిన వెంటనే వీటిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీలైనంత త్వరగా రోగులకు సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన పేర్కొన్నారు.

# సినిమా



## లైఫ్ ఎవరికీ సాఫీగా ఉండదు అంటూ

యాంకర్ సుమ.. ప్రత్యేకంగా పరిచయం అవసరం లేని పేరు. తన వాక్చాతుర్యంతో బుల్లితెర ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా.. రియాల్టీ షోస్ చేస్తూ టాప్ యాంకర్?గా కొనసాగుతుంది. యాంకర్ గానే కాదు సినిమాల్లోనూ నటిస్తూ మెప్పిస్తున్నారు సుమ. సుమ ఆమె భర్త రాజీవ్ కనకాల ఎంతో అన్యోన్యంగా ఉంటారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కరోనా సమయంలో ఈ ఇద్దరి బంధంపై రూమర్స్ వచ్చాయి.. సుమ , రాజీవ్ విడిపోతున్నారంటూ.. వేర్వేరు ఇళ్లలో ఉంటున్నారని గాసిప్స్ వచ్చాయి. దీని పై గతంలోనే సుమ క్లారిటీ ఇచ్చారు. తాజాగా మరోసారి సుమ విడాకులు అంటూ వస్తున్న వార్తల పై స్పందించారు. తాజాగా ఓ పాడ్ క్యాస్ట్ లో పాల్గొన్న సుమ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తన జీవితంలో జరిగిన ఎన్నో సంఘటనల గురించి సుమ మాట్లాడారు.సుమ మాట్లాడుతూ.. తనకు వచ్చే కలలు నిజం అవుతాయని తెలిపారు. నాకు వచ్చే కలలు నిజం అవుతాయి.. ఒకసారి మేం గుడికి వెళ్లినట్లు కల వచ్చింది. ఆతర్వాతి రోజు అనుకోకుండా అదే గుడికి వెళ్లాం.. ఆ తర్వాత విమానం కూలినట్లు కల వచ్చింది. ఆ కల నిజం అవుతుందేమోనని చాలా రోజులు విమానం ఎక్కాలంటే భయపడిపోయాను అని తెలిపింది సుమ. ఒకసారి రాజీవ్‌కు షూటింగ్‌లో యాక్సిడెంట్ అయ్యిందని. ఆ ప్రమాదంలో తన కాలు విరిగినట్లు కల వచ్చింది. అప్పట్లో ఫోన్‌లు లేవు.. ల్యాండ్‌లైన్‌లో మాట్లాడాలి. రాజీవ్ ఆ టైంలో తలకోనలో ఒక సినిమా షూటింగ్‌లో ఉన్నాడు. ఒక రోజంతా రాజీవ్ తో మాట్లాడటం కుదరలేదు.. నాకు భయం వేసింది. తర్వాత ఫోన్ చేసినప్పుడు 'నువ్వు బానే ఉన్నావా?' అని అడిగితే.. 'ఎందుకు అలా అడుగుతున్నావు?' అన్నాడు. నాకు ఇలా ఓ కల వచ్చింది అని చెబితే.. 'నిజంగానే నాకు కాలు విరిగింది. షూటింగ్‌లో నేను డ్రైవ్ చేస్తున్న కారు చెట్టుని ఢీకొట్టింది. నా కాలు విరిగింది అని చెప్పాడు. దాంతో నేను అక్కడికి వెళ్లి రాజీవ్ ను హాస్పటల్ లో చేర్పించా.. అని చెప్పారు సుమ.

అలాగే విడాకుల రూమర్స్ పై కూడా సుమ మాట్లాడారు.. మా పెళ్లి జరిగి 25 సంవత్సరాలు అవుతోంది. ఒక రిలేషన్ లో ఎన్నో అప్ అండ్ డౌన్స్ ఉంటాయి. రాజీవ్ కెరీర్, నా కెరీర్, పిల్లలు, పేరెంట్స్.. ఇలా అందరిని చూసుకుంటాను. మరో వైపు నా కెరీర్ ను కూడా బ్యాలెన్స్ చేసుకోవాలి. ఇలాంటి సమయంలో ఎదో ఒక విషయం పై మనస్పర్థలు రావడం సహజం. లైఫ్ ఎవరికీ సాఫీగా ఉండదు. ఇది ఒక రోలర్‌కోస్టర్ లాంటిది. ఒక టైంలో నేను రాజీవ్‌తో ఉండడం లేదని, విడాకులు తీసుకున్నానని కూడా రాసేశారు. మేమిద్దరం కలిసి రీల్స్ చేస్తూ వీడియోలు పోస్ట్ చేసినా కూడా 'ఏంటి మీరు ఇంకా కలిసే ఉన్నారా?, విడిపోలేదా?' అని కామెంట్స్ పెట్టారు. వాటిని ఇప్పుడు పట్టించుకోవట్లేదు అంటూ చెప్పుకొచ్చారు సుమ. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.






## ఈ ప్రాబ్లమ్స్‌ని కోరి తెచ్చుకున్నట్లే..

తేనె ఆరోగ్యానికి ఒక వరం లాంటిది. తేనె శరీరానికి చాలా ప్రయోజనకరమైన ఆహారం. ఆయుర్వేదంలో తేనెను ఔషధంగా ఉపయోగిస్తారు. యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటం వల్ల, తేనె మన శరీరాలను ఇన్ఫెక్షన్ల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. ఊబకాయాన్ని తగ్గించడం నుండి గొంతు నొప్పిని నయం చేయడం వరకు ప్రతిదానికీ దీనిని విస్తృతంగా ఉపయోగిస్తారు. తేనెలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు, ఎంజైమ్‌లు, అమైనో ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇది అనేక పోషకాలను కూడా కలిగి ఉంటుంది. కానీ, ఈ సహజ పదార్థం అయిన తేనెను కూడా అతిగా తీసుకోవడం శరీరానికి మేలు కంటే ముప్పే ఎక్కువగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.తేనెను ఎక్కువగా తీసుకోవడం వల్ల బరువు పెరిగే అవకాశాలు పెరుగుతాయి. ఎందుకంటే తేనెలో ఉండే చక్కెర, కార్బోహైడ్రేట్లు శరీరంలో కేలరీలను పెంచుతాయి. ఇది బరువు పెరగడానికి దారితీస్తుంది.

తేనె వేడెక్కించే ప్రభావాన్ని కలిగి ఉంటుంది. ప్రతిదానిలోనూ చక్కెరకు బదులుగా తేనెను ఉపయోగించడం వల్ల మీ జీర్ణక్రియ దెబ్బతింటుంది. మీ జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. కడుపు నొప్పికి దారితీస్తుంది. మలబద్ధకం, ఉబ్బరం పెరుగుతుంది.మీరు తేనెను క్రమం తప్పకుండా తీసుకుంటుంటే, అది మీ రక్తంలో చక్కెర స్థాయిని పెంచుతుంది. డయాబెటిస్ ప్రమాదాన్ని పెంచుతుంది.

తేనెను ఎక్కువగా తీసుకోవడం వల్ల మీ నోటి ఆరోగ్యానికి హాని కలుగుతుంది. తేనె మీ దంతాలకు అంటుకుంటుంది. దీని వలన దంతాల నొప్పులు, చిగుళ్ళ వాపు, పుండ్లు ఏర్పడతాయి. తేనెను తీసుకునే ముందు ఎల్లప్పుడూ మీ దంతాలను బ్రష్ చేసుకోండి.

సెలెరీలోని యాంటీఆక్సిడెంట్లు రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. అయితే దీనిని అధికంగా తీసుకోవడం వల్ల రక్తపోటు ప్రమాదం పెరుగుతుంది. ఇది వాంతులు, విరేచనాలు, ఉబ్బరం వంటి అలెర్జీ ప్రతిచర్యలకు కూడా కారణమవుతుంది.



## లైట్ తీసుకున్నారో మీ బాడి షెడ్డుకే!

మెంతులు ఆరోగ్యానికి ఒక వరం. వీటిని శతాబ్దాలుగా ఇంటి చిట్కాలలో ఉపయోగిస్తున్నారు. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడానికి, రక్తంలో చక్కెరను నియంత్రించడానికి, మంటను తగ్గించడానికి సహాయపడతాయి. అందుకే చాలా మంది దీనిని తమ దినచర్యలో భాగంగా చేసుకున్నారు. కానీ మెంతి నీరు అందరికీ ప్రయోజనకరం కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇది కొన్ని వ్యాధులతో బాధపడేవారికి హానికరం కావచ్చుని చెబుతున్నారు. అది తెలుసుకోకుండా వారు మెంతు నీరు తాగడం ప్రారంభిస్తే, అది మీ ఆరోగ్యానికి హాని కలిగించవచ్చు.గర్భిణీ స్త్రీలు

గర్భధారణ ప్రారంభ లేదా మధ్య నెలల్లో మెంతి నీరు తాగడం ప్రమాదకరం. మెంతి నీటిని ఎక్కువగా తాగడం వల్ల అకాల ప్రసవం లేదా గర్భస్రావం అయ్యే ప్రమాదం పెరుగుతుంది. ఇది గ్యాస్, వికారం లేదా కడుపు నొప్పికి కూడా కారణమవుతుంది. అందువల్ల, గర్భిణీ స్త్రీలు దీనిని తాగకుండా ఉండాలి.

థైరాయిడ్ రోగులు

కొన్ని అధ్యయనాల ప్రకారం, మెంతులలోని సమ్మేళనాలు థైరాయిడ్ హార్మోన్ పనితీరుకు ఆటంకం కలిగిస్తాయి. ఇది థైరాయిడ్ పనితీరుకు అవసరమైన అయోడిన్, శోషణను కూడా ప్రభావితం చేస్తుంది. కాబట్టి, థైరాయిడ్ రోగులు మెంతి నీటిని త్రాగే ముందు వైద్యుడిని సంప్రదించాలి.

కడుపు సమస్యలు ఉన్న వ్యక్తులు

మెంతుల్లో ఫైబర్, సాపోనిన్లు అధికంగా ఉంటాయి. ఇది కొంతమందిలో గ్యాస్, ఉబ్బరం, విరేచనాలు లేదా తిమ్మిరికి కారణమవుతుంది, ముఖ్యంగా ఖాళీ కడుపుతో తీసుకుంటే. మీకు %×దీూ% (ఇరిటబుల్ బవెల్ సింద్రోమ్), ఆమ్లత్వం లేదా జీర్ణ సమస్యలు ఉంటే, మెంతి నీటిని నివారించండి లేదా చాలా తక్కువ పరిమాణంలో తీసుకోండి.

## క్లారిటీ ఇచ్చిన కెప్టెన్ సూర్యకుమార్

భారత యువ క్రికెటర్ సంజు శాంసన్ టీ20 జట్టుకు దూరం కానున్నాడా అనే ప్రశ్న పెద్ద చర్చకు దారితీస్తోంది. ఆస్ట్రేలియాపై జరుగుతున్న టీ20 సిరీస్‌లో మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ అంచనా వేసినట్లుగానే సంజు శాంసన్‌కు చివరి రెండు మ్యాచ్‌లలో (నాలుగో, ఐదో టీ20) అవకాశం దక్కలేదు. మూడో టీ20లో కేవలం 2 పరుగులకే అవుట్ అయిన తర్వాత, శాంసన్‌ను పక్కన పెట్టడంపై ఊహాగానాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బ్యాటింగ్ లైనప్‌పై చేసిన కీలక వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.మాజీ భారత క్రికెటర్ మహ్మద్ కైఫ్ అంచనా వేసినట్లుగా, సంజు శాంసన్‌కు ఆస్ట్రేలియాతో జరిగిన చివరి రెండు టీ20 మ్యాచ్‌లలో తుది జట్టులో అవకాశం దక్కలేదు. మెల్‌బోర్న్‌లో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో సంజు శాంసన్‌కు నంబర్-3 స్థానంలో అవకాశం ఇవ్వగా, అతను కేవలం 2 పరుగులు మాత్రమే చేసి అవుటయ్యాడు. ఈ వైఫల్యం తర్వాత నుంచే సంజును జట్టు నుంచి తప్పిస్తారనే ఊహాగానాలు మొదలయ్యాయి.

సంజు శాంసన్ గతంలో ఓపెనర్‌గా చాలా బాగా ఆడాడు. బంగ్లాదేశ్‌పై సిరీస్ నుంచి ఓపెనింగ్ చేస్తున్న అతను 12 ఇన్నింగ్స్‌లలో 3 సెంచరీలతో సహా 417 పరుగులు చేశాడు. కానీ, శుభ్‌మన్ గిల్ జట్టులోకి తిరిగి రావడంతో అతని బ్యాటింగ్ స్థానం తరచుగా మారుతూ వచ్చింది. ఆసియా కప్‌లో ఓమన్‌పై నంబర్-3లో 56 పరుగులు చేసినా ఆ తర్వాత తన ఫామ్ సరిగా లేదు.బ్రిస్బేన్‌లో జరిగిన ఐదో టీ20 మ్యాచ్ టాస్ సమయంలో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ జట్టు బ్యాటింగ్ లైనప్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. "ఈ పిచ్ 200 పరుగుల కోసం కాదని ఆటగాళ్లంతా అర్థం చేసుకోవాలి. గత మ్యాచ్‌లో మా ప్రదర్శన బాగుంది. ద్వైపాక్షిక సిరీస్‌ను గెలవడం




ఎప్పుడూ మంచి అనుభూతిని ఇస్తుంది. మేము ఎల్లప్పుడూ మంచి కాంబినేషన్‌తో ముందుకు వెళ్లాలని కోరుకుంటాము. ఇది ఒక ఫార్మాట్. ఇందులో ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌లు మినహా మిగిలిన ఆటగాళ్లందరూ తమ బ్యాటింగ్ స్థానంలో ఫ్లెక్సిబిలిటీ చూపించాల్సి ఉంటుంది" అని స్పష్టం చేశారు.

సూర్యకుమార్ యాదవ్ చేసిన ఈ ఫ్లెక్సిబిలిటీ వ్యాఖ్యలు సంజు శాంసన్‌ను పరోక్షంగా ఉద్దేశించినవే అని విశ్లేషకులు భావిస్తున్నారు. టెస్ట్, వన్డే జట్లలో చాలా కాలంగా చోటు దక్కని సంజు శాంసన్‌కు టీ20 జట్టు నుంచి కూడా ఉద్వాసన పలికితే, అది అతని అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు దాదాపు ముగింపు కావచ్చునని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## సెంచరీతో మోత మోగించిన డీజే.

భారత్ ఏ, సౌతాఫ్రికా ఏ జట్ల మధ్య బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జరుగుతున్న రెండో అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో యువ వికెట్ కీపర్-బ్యాట్స్‌మెన్ ధ్రువ్ జురెల్ సంచలనం సృష్టించాడు. ఈ ఒక్క మ్యాచ్‌లోనే అతను ఏకంగా రెండు సెంచరీలు చేసి, టీమిండియా మేనేజ్‌మెంట్ దృష్టిని ఆకర్షించాడు. జట్టు కష్టాల్లో ఉన్న ప్రతిసారీ అద్భుత ప్రదర్శన చేసిన ధ్రువ్ జురెల్, రాబోయే సౌతాఫ్రికా టెస్ట్ సిరీస్‌కు సెలక్ట్ చేసే విషయంలో తన వాదనను బలంగా వినిపించడమే కాక టీమ్‌లోని కొన్ని స్థానాలకు పెద్ద ముప్పుగా మారాడు.భారత ఏ జట్టు వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ ధ్రువ్ జురెల్.. సౌతాఫ్రికా ఏ జట్టుతో జరుగుతున్న రెండో అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో అద్భుతంగా రాణించాడు. జట్టు 126 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న సమయంలో ధ్రువ్ జురెల్ 175 బంతులు ఎదుర్కొని నాటౌట్‌గా 132 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్ కారణంగానే భారత్ ఏ జట్టు 255 పరుగుల గౌరవప్రదమైన స్కోరును చేరుకోగలిగింది.తొలి ఇన్నింగ్స్‌లో ఫామ్‌ను కొనసాగిస్తూ రెండో ఇన్నింగ్స్‌లో కూడా జురెల్ సెంచరీ నమోదు చేశాడు. ఈసారి కూడా భారత్ 104 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి, రిషబ్ పంత్ గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్ అయిన తర్వాత ధ్రువ్ జురెల్ క్రీజులోకి వచ్చాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతను 159 బంతులను ఎదుర్కొని 12 ఫోర్ల సాయంతో సెంచరీని పూర్తి చేశాడు. ఈ క్రమంలో హర్ష్ దూబేతో కలిసి ఆరో వికెట్‌కు 184 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి, భారత్ స్కోరును 300 మార్కు దాటించాడు.సౌతాఫ్రికా టెస్ట్ సిరీస్‌కు ఎంపిక కావడానికి ముందు ధ్రువ్ జురెల్ ఆడిన ఈ రెండు కీలకమైన ఇన్నింగ్స్‌లు, జట్టులో అతని స్థానం గురించి చర్చకు దారితీశాయి. టెస్ట్ సిరీస్‌కు వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్ మొదటి ప్రాధాన్యతగా ఉండడం దాదాపు ఖాయం. కానీ, అతని తాజా గాయం సమస్యలను సృష్టించే అవకాశం ఉంది.ధ్రువ్ జురెల్ ఇప్పుడు ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి స్థానానికి పెద్ద ముప్పుగా మారాడు. గత సిరీస్‌లలో నితీష్ రెడ్డిని బౌలర్‌గా పెద్దగా ఉపయోగించలేదు. బ్యాటింగ్‌లో ధ్రువ్ జురెల్ చూపించిన ఈ అద్భుత ఫామ్‌ను పరిగణలోకి తీసుకుంటే, మెరుగైన బ్యాటింగ్ సామర్థ్యం ఉన్న ధ్రువ్ జురెల్‌ను జట్టులోకి తీసుకునేందుకు టీమ్ మేనేజ్‌మెంట్ మొగ్గు చూపవచ్చు.జురెల్ బ్యాటింగ్ మాత్రమే కాదు, వికెట్ కీపర్‌గా కూడా జట్టుకు ఉపయోగకరమే. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడల్లా బాధ్యతాయుతమైన బ్యాటింగ్ చేయగలనని అతను నిరూపించుకోవడంతో సౌతాఫ్రికా పర్యటనలో అతని పాత్ర కీలకం అయ్యే అవకాశం ఉంది. ఈ ప్రదర్శన అతన్ని టెస్ట్ సిరీస్ స్క్వాడ్‌లో చోటు దక్కించుకోవడంలో సహాయపడుతుంది.




Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .H NO : 21-119, WEST IBRAHIMPATNAM, KRISHNA, ANDHRA PRADESH - 521456.. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2844. Ph:9849707349 . email:kvp6858@gmail.com.